క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శ్రావణమాసం చివరి శుక్రవారం
అమ్మవారికి గాజులతో అలంకరణ



గాజుల అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

చేవెళ్ల: శ్రావణ మాసం చివరి శుక్రవారం ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో కొలువుతీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గాజుల అలకంరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. శ్రావాణమాసంలో ఎక్కువగా మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. దేవాలయ ప్రధాన అర్చకులు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రం పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు శుక్రవారం వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో రైతు వెంకట్‌రెడ్డి వ్యవసాయ పొలాన్ని విద్యార్థులు పరిశీలించారు. పొలంలో వరి నాట్లు, పంట దిగుబడి వచ్చే వరకు రైతులు నిర్వహించే వ్యవసాయ పనులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, గురించి ప్రిన్సిపాల్ రఫత్ సుత్తానా విద్యార్థులకు వివరించారు.

యువమోర్చా మండల అధ్యక్షుడిగా నర్సింహ



నర్సింహను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు: యువమోర్చా కొత్తూరు మండల అధ్యక్షుడిగా సిద్ధాపూర్‌కు చెందిన భైరమోని నర్సింహ ముదిరాజ్‌ను నియమించినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె బాబయ్య పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా గ్రామానికి వచ్చిన అందె బాబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు నర్సింహ ముదిరాజ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడిగా మధుసూదన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికై న సభ్యులను నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేపల్లి అశోక్‌గౌడ్, మంగళి రమేష్, రణధీర్‌గౌడ్, శ్రీశైలం, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్: మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని చేవెళ్ల నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ దామర్లపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిబావి బాలకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు బోకుల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రా పరిధిని విస్తరింపజేయండి'

షాద్‌నగర్: హైడ్రా పరిధిని హెచ్‌ఎండీఏ వరకూ విస్తరింపజేయాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న ప్రాంతాలకు హైడ్రాను విస్తరింపజేస్తే ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములు, నాలాలను పరిరక్షించొచ్చని పేర్కొన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తున్న లారీ ఓనర్స్

కొందుర్గు: లారీల యజమానులు యువతకు ఉపాధి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన కొందుర్గు మండల కేంద్రంలో లారీ అసోసియేషన్ వెల్ఫేర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీల యజమానులు ఎన్నో బాధలను భరిస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్, మండల కమిటీ అధ్యక్షుడు అబేద్, ఉపాధ్యక్షుడు ఖలీం, ప్రధాన కార్యదర్శి షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా..!

- ఈసీ వాగులో నుంచి తోడుతున్న వ్యాపారులు
- ట్రాక్టర్‌కు రూ. 5వేల నుంచి రూ. 8వేల వరకూ విక్రయం
- పట్టించుకోని అధికారులు



రాత్రి పూట ట్రాక్టర్లలోనింపి అక్రమ రవాణా చేస్తున్న వ్యాపారులు (ఫైల్)



నాగర్‌గూడ ఈసీ వాగులో ఇసుక తోడడంతో ఏర్పడిన గుంత



సోలిపేట్ ఈసీ వాగులో నుంచి లారీలో నింపుతున్న ఇసుక (ఫైల్)

షాబాద్: మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, నాగర్‌గూడ, చందనవెల్లి, హైతాబాద్, సోలీపేట్ గ్రామాల్లో వాగుల నుంచి అక్రమార్కులు ఇసుక తోడుతూ జోరుగా దందా సాగిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే వర్షాలు లేక భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతుండడంతో నీటి మట్టం తగ్గిపోతుంది. నామమాత్రంగా నడుస్తున్న బోరుబావులు సైతం ఎండిపోతున్నాయి. తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, చందనవెల్లి, రుద్రారం, హైతాబాద్, సోలీపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీ వాగు ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడి నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ట్రాక్టర్, లారీలు, టిప్పర్లలో నింపి రవాణా చేస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు ఇసుక అక్రమ రవాణా నిర్వహిస్తున్నా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో వాగుల్లో పెద్ద పెద్ద గోతులు, గుంతలు ఏర్పడుతున్నాయి. షాబాద్ మండలంలోనే కాకుండా చుట్టు పక్కల మండలాల్లో ఉండే స్థానికులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. మండలశాఖ అధికారులు తమ పరిధిలో నిర్వహించే అభివృద్ధి పనులకు కూడా ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకున్నా వ్యాపారులు తమ పనిని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అక్రమ రవాణాను కట్టడిచేసే బాధ్యతను పోలీస్‌శాఖ నుంచి రెవెన్యూశాఖకు అప్పగించడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ వ్యాపారాన్ని అడ్డుకునే వారే కరువయ్యారు. దీంతో ఇక్కడ వాగులు ఏడారిని తలపిస్తున్నాయి. నామమాత్రంగా పని చేస్తున్న బోరుబావులు కూడా ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా మండల అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించడం..

పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయం గురించి అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తునా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఈ దందా గురించి అధికారులను ప్రశ్నిస్తే లిఖిల పూర్వకంగా ఇస్తేనే చర్యలు తీసుకుంటామని బదులిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా తమదృష్టికి రానప్పుడు ఎలా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

చర్యలు తప్పవు



ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తాం. మండలంలోని ఏ గ్రామంలోనైనా వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సమయంలో మాకు సమాచారం అందించండి. ట్రాక్టర్లను సీజ్ చేసి వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ, షాబాద్

నూతన మోటార్ చట్టాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



అజీజ్‌నగర్ ఆటో స్టాండ్‌లో నూతన కమిటీతో అల్లి దేవేందర్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ సమీపంలో ఆటో కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ చట్టం వల్ల అధిక చలాన్లు వేసి ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 2019 నూతన మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ..

అజీజ్‌నగర్ ఆటో అడ్డా యూనియన్ నూతన అధ్యక్షుడిగా మహేందర్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా సయ్యద్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, బాబు, సహాయ కార్యదర్శులుగా వినోద్, మహ్మద్, అహ్మద్, మరో 20 మందిని నూతన కమిటిలో సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సిహెచ్ ప్రవీణ్‌కుమార్, గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షుడు రత్నం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం

క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్



మాట్లాడుతున్న దీపక్‌జాన్

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని మతాలు, వర్గాలకు సమన్యాయం కలుగుతుందని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్షిన్సియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పేర్కొన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని గుడ్ షెఫర్డ్ కమ్యూనిటీ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరిగినా ఏ ఒక్కరు మాట్లాడలేదన్నారు. ఈ ఘటన పై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మాత్రమే మాట్లాడి అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించారని గుర్తు చేశారు. కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం క్రైస్తవుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది క్రైస్తవ జనాభా ఉంటుందన్నారు. అందరు ఐక్యమత్యంతో మెలిగితేనే హక్కులు సాధించుకోవచ్చని సలహా ఇచ్చారు. క్రిస్టియన్లల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ స్వామిదాస్, ఉపాధ్యక్షుడు తిమోతి, జోసఫ్ ఫ్రాంక్లిన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మహిళా సంఘ సభ్యులకు మంజూరైన చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య వార్షిక మహాసభ శుక్రవారం మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరుచేస్తుందన్నారు. గతేడాది మండలంలో 1,050 సంఘాలకు రూ.50.40 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామన్నారు. మహిళలకు మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా రూ. 29.80 కోట్ల రుణాల చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ సంధ్య, ఏపీఎం రవీందర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అశ్విని, కోశాధికారి శ్రీనాకుమారి, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్‌కు జీతం అందజేత



విద్యావలంటీర్‌కు జీతం ఇస్తున్న ఆనంద్‌కుమార్

కేశంపేట: దాతల సహకారంతో నియమించిన విద్యావలంటీర్‌కు నెల జీతం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఇక్కడ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరు. విద్యార్థులకు చదువులో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గ్రామానికి చెందిన పల్లె ఆనంద్‌కుమార్, పల్లె బాలీశ్వర్‌లు విద్యా వలంటీర్‌ను నియమించి తమ సొంత డబ్బులను నెల జీతంగా ఇస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు వెనుకబడకుండా ఉండేందుకు అదనంగా ఒక విద్యావలంటీర్‌ను నియమించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యావలంటీర్‌కు పల్లె బ్రదర్స్ శుక్రవారం నెల జీతాన్ని అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయకుంటే ఆందోళన చేపడుతాం

ముదిరాజ్ సంఘం నేతల హెచ్చరిక

షాద్‌నగర్: చాక్లెట్ పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్య జలాలతో చెరువులోని చేపలు మృతి చెందాయని, వెంటనే పరిశ్రమ యాజమాన్యం మత్స్యకారులకు న్యాయం చేయాలని ముదిరాజ్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం నాయకులు అంచెరాములు, మంగ మధు, గడ్డం రమేష్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చటాన్‌పల్లి గ్రామ శివారులో చాక్లెట్ పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యపు నీటిని సురమోని చెరువులోకి వదులుతున్నారన్నారు. దీంతో చెరువు కాలుష్యంగా మారి అందులోని చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. ఎంతో మంది మత్స్యకారులు చేపల వృత్తిపైనే జీవనం సాగిస్తున్నారన్నారు. చేపలు చనిపోవడంతో తమకు వచ్చే ఆదాయం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పరిశ్రమ యజమాన్యం తమకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరిశ్రమ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

హైడ్రాకు ఫిర్యాదులు

మీర్‌పేట: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన బండి నగేష్ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నం. 155లోని సర్కారు జాగను కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. హైడ్రా అధికారులు స్పందించి, ఆక్రమణదారుల నుంచి భూమిని రక్షించాలని కోరారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీక

షాబాద్ సీఐ కాంతారెడ్డి

షాబాద్: పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని షాబాద్ సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. వినాయకచవితి, మిలాద్ ఉన్‌నబీలను కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెడుతూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారని, సత్య, అసత్యాలను తెలుసుకొని శాంతియుతంగా మెలగాలని సూచించారు. అభ్యంతరకర పోస్టులుంటే అందుబాటులో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగం మరువలేనివి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహనీయుల త్యాగాలను మరులేమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సేవా సమితి నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. పట్టణంలో రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహా ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజం కోసం, ఎలాంటి స్వార్థం లేకుండా పని చేసిన మహనీయుల అడుగుజాడలో నడవాలన్నారు. రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విగ్రహం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాజాబహదూర్ వెంకట్‌రామిరెడ్డి గొప్ప మానవతా వాది అని గుర్తు చేసుకున్నారు. నిజాం పాలనలో పేద విద్యార్థుల చదువు కోసం తన భూమిని విరాళంగా ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విగ్రహా ఏర్పాటునకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, సంఘం నాయకులు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, అరుంధతి, మధుకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ఆర్థిక చేయూత

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి



హిమాయత్‌నగర్ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మొయినాబాద్ రూరల్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఆర్థికంగా చేయూత అందజేయొచ్చని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాల విద్యార్థులు హెల్త్ సైన్స్, బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఫిజియో థెరపీ, రక్త పరీక్షలు, జనరల్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు గ్రామంలో ఉచిత వైద్య శిబిరంరంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ అవరణలో వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల కంటే మెరుగైన సేవలు అందించేందుకు తమ యూనివర్సిటీ తరపున ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 90 మందికి పైగా రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, కళాశాల వైస్ చైర్మన్ సాత్వికరెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ వై గాయత్రి, హెల్త్ అండ్ సైన్స్ డీన్ డాక్టర్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, యూనివర్సిటీ కళాశాల బయో కెమిస్ట్రీ విభాగం డాక్టర్ రాజేశ్వరి, శ్రీలత, జాహ్నవి, రిషికా, హిమశృతి, జాహ్నవి, గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏసీపీ బాలాజీనాయక్

చేవెళ్ల: వాహనదారులందరికీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో శుక్రవారం సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే అతనితోపాటు వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్, అపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడపటం, స్పీడ్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ లాంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



మొయినాబాద్ రూరల్: మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి సంధ్య, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్: ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో శుక్రవారం ఫ్రైడే–డ్రైడేలో భాగంగా ఇంటింటికి తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాంలో ఇళ్ల చుట్టుపక్కల ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, డాక్టర్ సాయిబాబా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో పరిసరాలను ప్రతిరోజు పంచాయతీ అధికారులు శుభ్రం చేయించాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య, ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలతో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగు గుంతలు తయారై దోమలు, ఈగలు పెరుగుతున్నాయన్నారు. దీంతో విషజ్వరాలు, రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మండల వైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు రంజిత్‌కుమార్, తారాబాయి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేటలో..

కేశంపేట: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ రాజ్, ఎడ్యుకేషన్, ఆరోగ్యశాఖ, వెటర్నరీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో జ్వర సర్వేలను నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, నాయబ్ తహసీల్దార్ గీత, మండల నోడల్ అధికారి చంద్రశేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత, విద్యాధికారి మనోహర్, నాగమణి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.